క్లుప్తంగా

ఎంసెల్లా చైర్ ప్రయోజనాలపై అవగాహన

కాకినాడ క్రైం: బహుళ ప్రయోజనాల ఎంసెల్లా చైర్‌పై కాకినాడలోని సృజన కాస్మెటిక్ గైనకాలజీ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం బీటీఎల్ సంస్థ ప్రతినిధి అన్ను ముంబై నుంచి వచ్చి వివిధ వయో వర్గాల మహిళలతో మాట్లాడారు. సృజన ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏఎల్ సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో మహిళల ఆరోగ్యంపై సూచనలిచ్చారు. పెల్విక్ కండరాల బలహీనత వల్ల ఏర్పడే సమస్యలు జీవన విధానంతో పాటు మానవీయ బంధాల పైనా ప్రతికూల ప్రభావాన్ని చూపతున్నాయన్నారు. పురుషుల సమస్యలకు సైతం ఎంసెల్లా చైర్ పరిష్కారం చూపుతుందని తెలిపారు. కేవలం 28 నిమిషాల పాటు 11000 కిగెల్ ఎక్సర్‌సైజ్‌లు చేయించి పెల్విక్ కండరాల పనితీరును మెరుగుపర్చడం ఎంసెల్లా చైర్ ప్రధాన విధి అని డాక్టర్ సత్యవతి తెలిపారు.

జీజీహెచ్‌లో కేర్ క్యాంపెయిన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎంవో డాక్టర్ రాహుల్

కాకినాడ క్రైం: కేర్ ఇండియా ఆధ్వర్యంలో జీజీహెచ్ ప్రసూతి విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న నర్సింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఆసుపత్రి కాన్ఫరెన్సు హాల్లో నిర్వహించిన ఈ శిక్షణా శిబిరాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ప్రారంభించారు. ప్రసవానంతరం, ప్రసవానికి ముందు సంరక్షణపై రెండు బ్యాచ్‌లుగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. బుధ, గురువారాల్లో మొత్తం వంద మంది నర్సులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. తొలి రోజు డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో రాహుల్, కేర్ ఇండియా ప్రతినిధి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పంతం సేవలు ఆదర్శనీయం



పద్మనాభం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గాంధీమోహన్ తదితరులు

కాకినాడ కల్చరల్: దివంగత మంత్రి పంతం పద్మనాభం సేవలు ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీమోహన్ అన్నారు. పంతం పద్మనాభం 24 వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కల్పనా సెంటర్‌లోని పంతం కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీమోహన్ నివాళులు అర్పించారు. అనంతరం సూర్యకళామందిర్‌లో వి.సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన పంతం పద్మనాభ స్మారక నాటక కళా పరిషత్ కార్యవర్గ సమావేశం జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్రా పద్మనాభం మాట్లాడుతూ అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈమేరకు సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యాళ్ల రామకృష్ణ, ఎస్.వెంకటేశ్వరావు, పంతం నెహ్రూ, దయానందబాబు, బాజిబోయిన వెంకటేష్‌నాయుడు, జానకిరామ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు, నాయకులు

కరప: స్థానిక మెరకవీధిలోని ఎంపీపీ పాఠశాలలో బుధవారం కాకినాడ ఆనందభారతి హైస్కూలు పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.10 వేలు విలువచేసే నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్‌కుమార్, నక్కా సత్తిబాబు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఆనందభారతి హైస్కూలు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు చికిత్స

కాకినాడ క్రైం: విశాఖ జిల్లా పాయకరావుపేటలో బుధవారం తెల్లవారుఝామున రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు జీజీహెచ్‌లో చికిత్స అందించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించారు. విశాఖ జిల్లా ఆనందపురానికి చెందిన పట్నాల నరసింగరావు, విజయలక్ష్మి, ప్రసాద్, మరో మహిళతో పాటు నాలుగేళ్ల నికిల్ రెడ్డి, ఆరేళ్ల సాయి అనే బాలిక ఒకే కుటుంబానికి చెందినవారు. అదే గ్రామానికి చెందిన కారు డ్రైవర్ గినేష్‌తో కలసి పుణ్యక్షేత్రాలు దర్శించి తిరుగుప్రయాణంలో వారి వాహనం ఆగి ఉన్న ఐషర్‌ను ఢీకొట్టింది. నిద్ర మత్తులోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తేల్చారు. గినేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చేర్చారు. మిగిలిన వారిని స్వగ్రామానికి వైద్యం కోసం తరలించారు. బాధితులను నర్సీపట్నం ఏఎస్‌పి అధిరా ఎస్ రాణా పరామర్శించారు.

ప్రభుత్వ ప్రతినిధిగా.. పేదలకు అండగా..

కాకినాడ/కాకినాడ కల్చరల్/కరప: సమాజంలో ఓటు వేయించుకోవడానికి తప్పితే ఎవరికీ అవసరం లేని జీవితాలు కొన్ని ఉంటాయి. ఐదేళ్లకోసారి తప్ప వారి ముఖాన్ని ఎవరూ పట్టించుకోరు. పేదరికంలో పుట్టిన పాపానికి పూట గడుపుకోవడానికి వారి పాట్లు వారు పడాల్సిందే. జీవితంలో అన్ని ద్వారాలూ మూసేసినా భగవంతుడు ఒక ద్వారం తెరిచి వెలుతురు ప్రసాదిస్తాడంటారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అలాంటి వెలుతురునే పేదింట ప్రసాదించింది. నవరత్న పథకాల ద్వారా దాదాపు అన్ని వర్గాల వారికీ ఎటువంటి సిఫార్సులు లేకుండా, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదలకు అందజేసింది. అటువంటి వలంటీర్ వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్రమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి ఆ వ్యవస్థనే అవమానించారు. ఆ వ్యాఖ్యలకు కలత చెందిన ఎందరో లబ్ధిదారులు వారి స్వీయ అనుభవాలు, వలంటీర్లతో వారికి ఉన్న అనుబంధాన్ని ఇలా వివరించారు.

కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు



మేము రజకులం. భర్త మృతి చెందడంతో కులవృత్తి చేసుకుంటూ ముగ్గురు పిల్లలను చదివించుకుంటున్నాను. పెద్ద చదువులు చదవాలని పిల్లల కోరికైనా ఆ స్థోమత నాకు లేదు. ఆ సమయంలో మా వలంటీర్ నక్కా దుర్గాప్రసాద్ తన విధి నిర్వహణలో భాగంగా మా ఇంటి వివరాలు, పిల్లల వివరాలు అడిగి నవరత్న పథకాల గురించి వివరించారు. పిల్లలకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యా వసతి పథకాలు వర్తిస్తాయని చెప్పి వాటిని వర్తింపజేశారు. దీంతో పెద్ద బ్బాయి దారబాబు బీటెక్ ఫైనల్ ఇయర్, రెండో అబ్బాయి సాయిబాబు డిగ్రీ, కుమార్తె అపర్ణ ఇంటర్ చదువుతున్నారు. కుటుంబానికి ఏ అవసరమొచ్చినా వలంటీర్‌తో చెప్తాం. ఒకరోజు అతనే ఇంటికి వచ్చి జగనన్న చేదోడు పథకం గురించి చెప్పి రూ.10 వేలు ఇస్తారని నాతో దరఖాస్తు చేయించారు. ఆ డబ్బు వచ్చింది. దీంతో తోపుడుబండి కొనుక్కుని, దుస్తులు ఇస్త్రీ చేస్తూ ఉపాధి పొందుతున్నాం. జగనన్న పుణ్యమా అని వలంటీర్ సేవలు, అతని సహకారం మరచిపోలేం.

– చీపురపల్లి పైడమ్మ, కరప

వలంటీర్ సేవలు మరువలేనివి



నాపేరు పి.లక్ష్మీకళ. నేను రంగయ్యనాయుడు వీధిలోని యాళ్లవారి వీధిలో ఉంటున్నాను. రోజువారీ పనులతో పూట గడిచేది. పని లేకపోతే కొంచెం కష్టంగా ఉండేది. ఈ క్రమంలో మా వలంటీర్ వి.సత్యదేవి కాపునేస్తం పథకం గురించి వివరించి నాతో దరఖాస్తు చేయించారు. ఈ పథకం ద్వారా రూ.15 వేల సాయం అందింది. ఈ డబ్బు ఎంతో ఆసరాగా నిలిచింది. సమీపంలోని గొల్లప్రోలు దుస్తుల మార్కెట్‌కు వెళ్లి లాటుగా తీసుకువచ్చి ఇంటిలో విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాను. ప్రస్తుతం వచ్చే సంపాదనతో జీవన ప్రమాణాలు కూడా పెరిగాయి. ఇంత సాయం చేసిన మా వలంటీర్ సేవలు ఎప్పటికీ మరువలేను.

– పి.లక్ష్మీకళ, యాళ్లవారివీధి, కాకినాడ

ప్రభుత్వ పథకాలన్నీ ఇంటికే ఇచ్చారు



ఒంటరి మహిళనైన తనకు జగనన్న ప్రభుత్వం అడగకుండానే అన్ని పథకాలను అందజేసింది. ఇందుకు కారణం మా వలంటీర్ అన్నపూర్ణ అని గర్వంగా చెప్తాను. ఓ ఇంటిలో వాచ్ ఉమెన్‌గా పనిచేస్తూ జీవిస్తున్న నాకు ఆమె చేదోడు వాదోడుగా నిలచి ఎంతో సాయం చేశారు. ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛనును నా పేరుపై ఆమె దరఖాస్తు చేసి మంజూరు చేయించారు. సకాలంలో నెలనెలా పింఛను అందజేయడంతో పాటు రేషన్‌కార్డు కూడా ఇప్పించారు. ఇంత చేసి కూడా ఇంటి స్థలం మంజూరు చేయించారు. ఆమె వల్లే నేను ఇన్ని ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాను. నెలనెలా ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇప్పిస్తూ చోదోడుగా ఉంటుంది.

– మావూరి పార్వతీదేవి, దాట్లవారివీధి, కాకినాడ

అర్హతను బట్టి పథకాలు ఇప్పిస్తున్నారు..



పేదరికంలో ఉన్న నా కుటుంబానికి వలంటీర్ ఎంతో చేయూతనిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ లక్ష్యాన్ని నెరవేర్చారు. నా భర్త పెయింటింగ్స్ వేస్తుంటారు. గృహిణినైన నాకు జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్ చక్రధర్ నవరత్న పథకాలను వివరించి మాకు అర్హమైన పథకాలను వర్తింపజేశారు. కొమరగిరిలో ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని మంజూరు చేయించారు. మా కుమార్తెకు విద్యా దీవెన పథకాన్ని ఇప్పించారు. ఆసరా పథకంలో మూడేళ్లుగా సొమ్ములు మా ఖాతాలో జమ అవుతున్నాయి. ఇటువంటి వలంటీర్లు ఉండడం వల్ల పేదరికంలో ఉన్న వారు కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా పథకాలు అందుతున్నాయి. వారి సేవాభావాన్ని ఎన్నటికీ మరువలేము.

– పిల్లి పద్మ, గాంధీనగర్, కాకినాడ

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం

- ఎస్పీ సతీష్‌కుమార్



సూర్యారావుపేట బీచ్‌లో ఎస్సై తదితరులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ రూరల్: వారధి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, దొంగతనాలు–రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కోరారు. తిమ్మాపురం పోలీస్‌స్టేషన్, స్టేషన్ పరిధిలోని బీచ్, పండూరు జంక్షన్, ఏడీబీ రోడ్లను ఆయన పరిశీలించారు. బీచ్‌లో భద్రతాపరంగా తీసుకోవలసిన చర్యలు, సందర్శకులకు బందోబస్తు, పెట్రోలింగ్ తదితర అంశాలపై సూచనలిచ్చారు. తిమ్మాపురంలో నిర్మాణంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించడంతో పాటు పోలీసుస్టేషన్లలోని రికార్డులను పరిశీలించి ఎస్సై నాగార్జునరాజు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

గంగనాపల్లిలో వారధి

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లి గ్రామంలో పోలీసులు వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై నాగరాజు, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి తదితరులు గ్రామస్తులకు వారధి కార్యక్రమం గురించి వివరించారు. అసాంఘిక కార్యక్రమాలను పూర్తిగా నిర్మూలించేలా ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు.

జగనన్న సురక్షకు అనూహ్య స్పందన

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- గుడారిగుంట, సూర్యారావుపేటలో ధ్రువీకరణ పత్రాల అందజేత



సూర్యారావుపేటలో దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



గొర్రిపూడిలో దరఖాస్తుదారుకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కాకినాడ రూరల్: పేదలకు ప్రయోజనం కలిగేలా ఉచితంగా 11 రకాల సేవలను జగనన్న సురక్ష ద్వారా సీఎం జగన్ అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజల్లో అనూహ్య స్పందన వస్తోందని, పెద్ద ఎత్తున పత్రాలను పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. బుధవారం కాకినాడ అర్బన్ సచివాలయం-2 బీసీ పేటలోను, రూరల్ మండలం సూర్యారావుపేటలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. షెడ్యూల్ ప్రకారం నియోజవర్గంలోని అర్బన్ డివిజన్లు, రూరల్‌లోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మీ ఇళ్లకు వచ్చి మీకు అవసరమైన ధ్రువపత్రాలను సురక్ష ద్వారా ఉచితంగా అందిస్తున్నారన్నారు. అలాగే గడపగపడకూ మన ప్రభుత్వం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. గుడారిగుంటలో అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు, అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. సూర్యారావుపేటలో సర్పంచ్ సూరాడ చిన్ని, ఎంపీడీఓ స్వప్న, ఏఓ సత్యనారాయణ, తహసీల్దార్ మురార్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు సూరాడ రాజు, కోమలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందజేత

కరప: మండలంలోని గొర్రిపూడి–1 గ్రామసచివాలయం–1లో బుధవారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని సర్పంచ్ కె.రమాదేవి ప్రారంభించారు. అధికారులతో కలసి 582 మంది దరఖాస్తుదారులకు కౌలు గుర్తింపు కార్డులు, ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు యనమదల వెంకటలక్ష్మి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచరావు, గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాస్, వీఆర్వో డి.భరణికుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు పుణ్యమంతుల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలతో మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సూర్యారావుపేటలో సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: గ్రామ సచివాలయ నూతన భవనాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని సూర్యారావుపేటలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రూ.39 లక్షలతో నిర్మించి సచివాలయ భవనానికి బుధవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ ప్రజలకు మెరుగ్గా సేవలందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. గ్రామ సచివాలయాలు వచ్చిన తరువాత ప్రజలు గ్రామాల నుంచి పనులు కోసం కార్యాలయాల చుట్టూ తిరగవల్సిన పని తప్పిందన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నారన్నారు. మత్స్యకార గ్రామం సూర్యారావుపేట ప్రజలు గ్రామ సచివాలయం ద్వారా సేవలు పొందాలన్నారు. మత్స్యకారులకు అండగా ఉంటామని, ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ సూర్యాడ చిన్ని, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి ఆశీర్వచనాలు ఇవ్వాలని ఇంద్రపాలెం గ్రామస్తులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఇంద్రపాలెం సచివాలయం–2 పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, లిటిల్‌బడ్స్ స్కూల్ ప్రాంతం, వెంకటరమణా నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ప్రభుత్వం ద్వారా అందుకున్న సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో మద్దతుగా నిలవాలన్నారు. మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిచేలా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, గ్రామ నాయకులు, మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లుకు ప్రాధాన్యమివ్వండి

- జిల్లాలో 25 శాతం నారుమళ్లు
- నెలాఖరుకల్లా నాట్లు పూర్తిచేయాలి
- జేడీఏ విజయ్‌కుమార్



జెడ్.భావారంలో వెదజల్లిన పొలాలను పరిశీలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప: ఈ నెల ఒకటో తేదీనే కాలువలకు నీరు వదలినా, ప్రతికూల పరిస్థితుల్లో నారుమళ్లు వేసుకోవడంలో రైతులు ఆలస్యం చేశారని, ఈ కాలాన్ని భర్తీ చేసేందుకు వెదజల్లుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆయన జెడ్.భావారం, పేపకాయలపాలెం, కరప తదితర గ్రామాల్లో పర్యటించి, నారుమళ్లు, వెదజల్లిన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. సరైన సాగు ప్రణాళిక రూపొందించుకుంటే వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవచ్చన్నారు. జిల్లాలో 2.29 హెక్టార్ల విస్తీర్ణంలో సార్వా సాగు చేస్తుండగా, ఇంత వరకు 25 శాతం నారుమళ్లు వేయడం, దమ్ములు, వరినాట్లు, వెదజల్లు ప్రక్రియ పూర్తయిందన్నారు. నారుమళ్లు వేసిన వారు యాజమాన్య పద్ధతులు అనుసరించి, ఈ నెలాఖరుకు వరినాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. వెదజల్లు సాగువల్ల పెట్టుబడులు ఆదా కావడమే కాకుండా, రెండు వారాలు పంటకాలం తగ్గుతుందన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు ఎప్పటికప్పుడు వాతావరణ వివరాలు వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా ప్రచారం చేయిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఖరీఫ్‌లో ఎరువులు, పురుగుమందుల కొరత లేకుండా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. కాలువల్లో సాగునీరు తక్కువగా వస్తోందన్న రైతుల ఫిర్యాదులను ఇటీవల తమతో కలెక్టర్ కృతికా శుక్లా నిర్వహించిన సమావేశంలో వివరించామని ఆయన అన్నారు. దీంతో ఆమె నీటిపారుదల అధికారులకు ఇచ్చిన సూచనల మేరకు వారు చర్యలు తీసుకున్నారని, అందువల్ల బుధవారం నుంచి కాలువల్లో నీటిమట్టం పెరిగిందని, రైతులు సార్వా పనులు ప్రారంభించి, పనులు పూర్తి చేసుకోవాలన్నారు.

15 నుంచి పుష్కర, పంపా కాలువలకు నీరు

ఈనెల 15వ తేదీ నుంచి పుష్కర, పంపా కాలువలకు సాగునీరు విడుదల చేస్తామని జేడీఏ విజయ్‌కుమార్ తెలిపారు. ఆ ప్రాంత రైతులు సార్వా పనులు చేపట్టేలా చైతన్య పరుస్తున్నామన్నారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, టెక్నికల్ ఏఓ పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

గుర్తింపు కార్డులున్న కౌలు రైతులందరికీ పంటరుణాలు మంజూరు చేసేలా బ్యాంకు మేనేజర్లు సహకరించాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం బ్యాంక్ మేనేజర్లు, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ అధికారులు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు వ్యాపారులవద్ద అప్పులుచేసి, నష్టపోతున్న కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సీసీఆర్‌సీ పత్రాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. గతంలో మాదిరిగా గుర్తింపు కార్డులున్న కౌలురైతులకు పంటరుణాలు అందజేయాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ వీరికి వర్తిస్తాయని బ్యాకర్లకు జేడీఏ వివరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్లకు గ్రామాల వారీగా గుర్తింపు కార్డులిచ్చిన కౌలురైతుల జాబితాలను అందజేశారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఎన్‌జేసీ సురేష్‌బాబు, మండల పశువైద్యాధికారి డాక్టర్ రవికిరణ్, ఎంఏఓ ఏవీ రాజేష్, టెక్నికల్ ఏఓ పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ల సమస్యలు పరిష్కరిస్తా

- మంత్రి ఆదిమూలపు సురేష్ హామీ



మంత్రి సురేష్‌ను సత్కరిస్తున్న నాగనరసింహారావు, కార్యవర్గ సభ్యులు

కాకినాడ: ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపల్ కమిషనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్‌హామీ ఇచ్చారు. ఏపీ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ నాగనరసింహారావు ఆధ్వర్యంలో సంఘ కార్యవర్గ సభ్యులు బుధవారం మంత్రి సురేష్‌ను తాడేపల్లిలో కలసి సమస్యలపై చర్చించి వినతి పత్రం అందజేశారు. సమావేశపు వివరాలను నాగనరసింహారావు బుధవారం సాయంత్రం విలేకర్లకు వివరించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లోని కమిషనర్లను కేడర్ పోస్టులుగా పరిగణించాలని, డిప్యూటేషన్ పోస్టులు రద్దు చేయాలని మంత్రిని కోరారు. మెప్మా పీడీ అధికారులను కమిషనర్ పోస్టుల్లో భర్తీ చేయాలని, యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, కోశాధికారి శివారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఏసుబాబు, సంయుక్త కార్యదర్శులు ఎస్.అమరయ్య, కేవీఆర్ రాజు, బాషా, కార్యవర్గ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగనరసింహారావు, కార్యవర్గ సభ్యులు మంత్రి ఆదిమూలపు సురేష్‌ను సత్కరించారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ పాలన



లబ్ధిదారుకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 18వ డివిజన్ తూరంగి పేట సచివాలయంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఎక్కడైనా అర్హత కలిగి ప్రభుత్వ పథకాలు అందకపోతే వారిని గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, వ్యవసాయమార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్ ధోణి చిట్టిబాబు, మాజీ కార్పొరేటర్లు బొర్రా రమణ, పేర్ల జోగారావు, చవ్వాకుల రాంబాబు, స్థానిక నాయకులు మోసా రాజు, కోరాడ సతీష్, సద్గురు మూర్తి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఓసీ నిధులు కార్మికులకే ఖర్చుచేయాలి


కాకినాడ సిటీ: భవన నిర్మాణ రంగం (బీఓసీ) సంక్షేమ బోర్డు నిధులను ఆ కార్మికులకే ఖర్చు పెట్టాలని, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని, కార్మికుడు చనిపోతే రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని పైళ్లమ్మ తల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బుధవారం కాకినాడ ఎస్.అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలో సంఘం సమావేశం జరిగింది. సంఘం సభ్యురాలు అనుసూరి అప్పయ్యమ్మ మరణానికి సంతాపం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల నాయకులు రాయుడు గోవిందు, కుంచే అంజిబాబు, ఆర్.సతీష్, వల్లూరి రాజబాబు, నాగమణి, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: వార్షిక విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా డి–8 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గైగోలుపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, పాత గైగోలుపాడు, కొత్త గైగోలుపాడు, సోమాలమ్మ గుడి రోడ్డు, అంబేద్కర్ పాకలు, రామ్‌నగర్, దత్తసాయినగర్, ఆదర్శనగర్, దేవీనగర్ రోడ్ నెంబర్–1,2, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రూ.2.5 కోట్లు తక్షణం వసూలు చేయండి

- షాపింగ్ కాంప్లెక్సుల అద్దె బకాయిలపై కమిషనర్ మహేష్‌కుమార్ ఆదేశం



అద్దె బకాయిలపై సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: నగరపాలక సంస్థ ఆధీనంలోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి బకాయి ఉన్న అద్దెలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన లీజు బకాయిలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. వివిధ దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి రూ. 2.5 కోట్ల బకాయి వసూలు కావలసి ఉందన్నారు. ఈ మొత్తం సొమ్మును నెలాఖరు లోపుగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కొన శ్రీనివాస్, ఆర్వో చక్కా రమణ, పలువురు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

జగన్ పథకాలపై ప్రజల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 34వ డివిజన్‌లో గడప గడపకూ..



ఓ ఇంటి వద్ద చిన్నారితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో పూర్తి సంతృప్తి కనిపిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 34వ డివిజన్ పరిధిలోని మెజిస్టిక్ వీధి, సూపర్‌బజార్ ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ముస్లింలు అధికంగా నివసించే డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. తన హయాంలో కాకినాడలో రెండు కొత్త మసీదులను నిర్మించడంతో పాటు మదర్‌సా, షాదీఖానా, కబరస్థాన్‌లను అభివృద్ధి చేశామన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మరోసారి ఆయనను సీఎం చేయాలనే సంకల్పాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయన వెంట కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పోష్ కమిటీ సభ్యురాలు కృష్ణప్రియ, మాజీ కార్పొరేటర్, తెహరాఖాతూన్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.